Eenadu DT 18/09/17





- మూడు కారిడార్‌లను ఏ, బీ, సీగా వర్గీకరణ
- ప్రతి పిల్లర్‌కూ సంఖ్య కేటాయింపు
- ఏ-1 మియాపూర్‌లో, సి-1001 హైటెక్‌సిటీలో
- గూగుల్ మ్యాప్స్‌కు అనుసంధానం

# మెట్రో స్తంభాలే... చిరునామాలు!

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు స్తంభాలు నగరంలో ఇప్పటికే పలు చోట్ల చిరునామా కేంద్రాలుగా మారాయి. వీటిని మరింత పక్కాగా చేయబోతున్నారు. ఇందులో భాగంగా ప్రతి స్తంభానికీ సంఖ్యను కేటాయించనున్నారు. మియాపూర్ నుంచి మొదలుపెట్టి ఫలక్‌నుమా వరకు చిరునామా సంఖ్యలను కేటాయించాలని హెచ్ఎంఆర్ నిర్ణయించింది. కారిడార్ల వారీగా సులభంగా గుర్తించేలా ఆంగ్ల అక్షరాలు. ఏ, బీ, సీలను అంకెలు, సంఖ్యల ముందు చేర్చాలని అధికారులు నిర్ణయించారు. నగరంలో ఇంటి నంబర్లతో చిరునామా కనుక్కోవడమంటే కొత్త వారికి సవాలే. కనీసం కొండగుర్తు అయినా చెప్పగలిగితే చిరునామా తెలుసుకోవడం సులువవుతుంది. ఆ రకంగా ఇప్పటికే మెట్రో స్తంభాలు గుర్తులుగా మారాయి. నగరవాసులతోపాటూ ఇక్కడికి వచ్చే పర్యాటకులకు చిరునామా కనుక్కోవడం సులువుగా ఉండేలా మెట్రో స్తంభాలకు కేటాయించిన సంఖ్యను జీపీఎస్‌తో గూగుల్ మ్యాప్స్‌నకు అనుసంధానించబోతున్నారు. ఆదివారం బేగంపేట మెట్రోరైలు భవన్‌లో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్అండ్‌టీ మెట్రో రైలు ఎండీ శివానంద్ నింబర్గి, మెట్రో నిర్వహణ చూస్తున్న కియోలిస్ ప్రతినిధులు, సీనియర్ అధికారులతో ఈ అంశంపై మేధోమథనం నిర్వహించారు. రెండోదశలో మెట్రోని వేర్వేరు మార్గాల్లో విస్తరించే ప్రణాళికలు ఉన్నాయి. వీటికి డీ, ఈ, ఎఫ్ గా చేసి సంఖ్యలను కేటాయించనున్నారు.

**మంత్రి కేటీఆర్ అభినందించారు**

– ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రోరైలు

ప్రతి స్టేషన్‌లో 4 ప్రవేశ మార్గాలుంటాయి. అమీర్‌పేటలాంటి స్టేషన్‌లో ఎక్కువ. వీటికి 1,2,3,4 అంకెలను కేటాయించనున్నాం. టోక్యోలో ఈ తరహాలో ఉంటాయి. ఎవరైనా స్టేషన్‌లోకి ప్రవేశమార్గం అంకెనుబట్టి సులువుగా చేరుకుంటారు. అంతర్జాతీయ స్థాయిలో సూచిక బోర్డుల ఏర్పాట్లు ఉంటాయి. మెట్రోస్టేషన్‌కు దారితీసే ప్రాంతాల్లో తెలుగు, ఇంగ్లిష్‌లో వీటిని ఏర్పాటు చేస్తాం. దీన్ని మంత్రి కేటీఆర్ అభినందించారు. ఈ విధానాలతో ప్రజలకు సౌకర్యంతోపాటూ హైదరాబాద్ మరింత ఆకర్షణీయ నగరంగా మారుతుందన్నారు. వీటిపై సూచనలను మెట్రోరైలు వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయవచ్చు.

## ఏ-1 నుంచి 1108 వరకు

కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు 29 కి.మీ. మార్గమిది. దీనికి 'ఏ' కేటాయించారు. మియాపూర్‌లో ప్రారంభ మెట్రో స్తంభానికి ఒకటో నంబరు ఇచ్చారు. దాన్ని ఏ-1గా ట్యాగ్ చేయబోతున్నారు. అమీర్‌పేట స్టేషన్ సమీపంలోని స్తంభానికి ఏ-450, ఎంజీబీఎస్ దగ్గర ఏ-769, ఎల్బీనగర్ ఆఖరి స్తంభానికి ఏ-1108 సంఖ్యను కేటాయించనున్నారు.

## బి-1 నుంచి 588 వరకు

కారిడార్-2 జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 15 కి.మీ. ఉంటుంది. ఈ మార్గానికి 'బి'ని కేటాయించారు. జేబీఎస్ స్టేషన్ సమీపంలో మొదలయ్యే మొదటి స్తంభానికి బి-1 ఇచ్చారు. ముషీరాబాద్ స్టేషన్ సమీపంలోని మెట్రో స్తంభం బి-152, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద స్తంభానికి బి-196, ఇమ్లిబన్ దగ్గర బి-356, భవిష్యత్తులో కట్టబోయే ఫలక్‌నుమాలోని చివరి స్తంభానికి బి-588 సంఖ్య కేటాయిస్తారు.

## సి-1 నుంచి 1,052 వరకు

కారిడార్-3 మార్గం నాగోల్ నుంచి రాయదుర్గం వరకు వెళుతోంది. ఇదీ 29 కి.మీ. పైనే ఉంటుంది. దీనికి 'సి' కేటాయించారు. నాగోల్ స్టేషన్ బ్రిడ్జి దగ్గర మొదలయ్యే మొదటి స్తంభాన్ని సి-1గా ట్యాగ్ చేయనున్నారు. మెట్టుగూడ దగ్గర సి-296, బేగంపేట దగ్గర సి-583, అమీర్‌పేట సమీపంలో సి-623, హైటెక్‌సిటీ దగ్గర స్తంభానికి సి-1001, రాయదుర్గం చివరి స్తంభానికి సి-1,052 సంఖ్యను కేటాయించి గూగుల్ మ్యాప్స్‌తో అనుసంధానం చేయనున్నారు.



సమావేశంలో ఎన్వీఎస్‌రెడ్డి, ఇతర అధికారులు